క్లుప్తంగా

ఆలయాల్లో 'జలగం' ప్రత్యేక పూజలు



శివాలయంలో స్వామి వారిని దర్శించుకుంటున్న జలగం వెంకట్రావు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి, శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి, పెనుబల్లి మండలం బయ్యన్నగూడెంలోని సత్యనారాయణ స్వామి ఆలయాల్లో శనివారం కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జలగం వెంకట్రావు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల్లో స్వామి వార్లను దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాలకు విచ్చేసిన ఆయనకు అర్చకులు వేదమంత్రాల ఆశీర్వచనంతో స్వాగతం పలికారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట శివాలయ పునఃనిర్మాణకర్త మారగాని శ్రీనివాసరావు, నకరికంటి కోటేశ్వరరావు, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, స్థానికులు ఉన్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న విజయ్‌కుమార్

సుజాతనగర్: ప్రతీరోజూ 250 మంది అయ్యప్ప, ఆంజనేయస్వామి మాలధారులకు అన్నదానం చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు ఓ ఎంపీటీసీ. సుజాతనగర్ మండలం సర్వారం గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడైన బానోత్ విజయ్‌కుమార్‌కు అయ్యప్ప స్వామి భక్తుడు. ఈ నేపథ్యంలో ఐదేళ్లుగా మాలధారులకు అన్నదానం చేస్తున్నాడు. ఈ ఏడాది కూడా 18 రోజులుగా 250 మంది అయ్యప్పలకు స్థానిక రామాలయంలో ప్రతీరోజు మధ్యాహ్నం అన్నదానం చేస్తున్నాడు. మొత్తం 70 రోజుల పాటు అన్నదానం చేస్తానని ఈ సందర్భంగా విజయ్‌కుమార్ తెలిపాడు. గతంలో అటవీశాఖలో ఎఫ్‌బీఓగా పనిచేసే ఆయన ఉద్యోగానికి రాజీనామా చేసి ఎంపీటీసీగా గెలుపొందాడు.

ర్యాలీలు, సభలకు అనుమతి లేదు

జూలూరుపాడు: ఈనెల 5వ తేదీ వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుందని జూలూరుపాడు సీఐ ఎం.శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ పురుషోత్తంతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఆదివారం అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ ఉన్నందున 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

ర్యాలీలు, సభలు, సమావేశాలు, డీజేలకు ఎలాంటి అనుమతి లేదన్నారు. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎవరు గెలిచినా పరస్పరం సహకరించుకొని, గొడవలు జరగకుండా చూడాలని రాజకీయ పార్టీలను కోరారు. గెలిచిన వారు ర్యాలీలు, సభలు, సమావేశాలు, బాణసంచా కాల్చడానికి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సూచించారు.

అప్రెంటిస్ విద్యార్థులకు వీడ్కోలు



విద్యార్థులకు వీడ్కోలు పలుకుతున్న ఏరియా వర్క్‌షాపు అధికారులు, ఉద్యోగులు

సింగరేణి(కొత్తగూడెం): అప్రెంటిస్ పిరియడ్‌లో క్రమశిక్షణతో పనిచేసి, వృత్తి నైపుణ్యంలో రాణిస్తే భవిష్యత్‌లో పెద్ద కంపెనీలలో ఉద్యోగాలు మీ సొంతం అవుతాయని ఏరియా వర్క్‌షాపు ఎస్‌ఈ శ్రీకాంత్, ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ తెలిపారు. కొత్తగూడెం ఏరియా పరిధిలోని ఏరియా వర్క్‌షాపులో కొంతకాలంగా పనిచేసిన ఎలక్ట్రీషియన్ అప్రెంటిస్‌షిప్ విద్యార్థులకు అవుట్‌డోర్ ఎలక్ట్రికల్ టీం ఆధ్వర్యంలో శనివారం వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఉద్యోగంలో పేరు వస్తే ఆ కంపెనీలో గుర్తింపు లభిస్తుందని, దీంతో పాటు తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చిన వారవుతారన్నారు.

ఈ కార్యక్రమంలో వర్క్‌షాపు ఇంజనీర్లు ఏ.ఉపేందర్‌బాబు, బి.శంకర్, టి.అనిల్, సీఎట్ సెక్రటరీ ఎండీ సత్తార్ పాషా, ఫోర్‌మెన్ ఇన్‌చార్జ్ రవి, ఎలక్ట్రీషియన్లు శ్రీకాంత్ శర్మ, దేవేందర్, ఎల్లయ్య, శ్రీనివాస్, ఎస్.మహేశ్వర్‌రావు, ఎస్కే రియాజ్, పరుశురామ్, ప్రకాశ్, కృష్ణారావు, లింగయ్య, రామకృష్ణ, నరహింహారావు, రమేష్, నరేష్, మోహన్‌లాల్ పాల్గొన్నారు.

ఫలితాలపై ఉత్కంఠ!

నేడు అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు

- అభ్యర్థులు, నేతల్లో టెన్షన్..
- ఇల్లెందు బరిలో 20 మంది



ఇల్లెందు: ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న అభ్యర్థుల భవితవ్యం తేలే సమయం ఆసన్నమైంది. కౌంటింగ్ సమయం దగ్గర పడుతుండటంతో అభ్యర్థుల్లో టెన్షన్.. నెలకొంది. ఇల్లెందు అసెంబ్లీ బరిలో జాతీయ, ప్రాంతాయ పార్టీలతో పాటు ఇండిపెండెంట్ అభ్యర్థులు 20 మంది బరిలో ఉన్నారు. అయితే ఇద్దరి మధ్యనే ప్రధానంగా పోటీ నెలకొంది. ఆ ఇద్దరికీ ఇండిపెండెంట్లు, బీజేపీ, ఎన్డీ అభ్యర్థులు ఏ మేరకు ఓట్లకు గండి కొట్టారనే దానిపై లెక్కలు వేసుకుంటున్నారు. బరిలో నిలిచిన ఇతర అభ్యర్థులు గెలుపుపై నమ్మకం లేకపోగా, నమోదయ్యే ఓట్లపై వారికి తోచిన విధంగా వారు లెక్కల్లో తన మునకలవుతున్నారు. ఈసారి నియోజకవర్గంలో 2,19,569 ఓట్లు ఉండగా, 1,76,840 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 1,07,909 పురుషులు ఉండగా 87,421 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. స్త్రీలు 1,11,658 మంది ఉండగా 89,418 మంది ఓటు వేశారు. 42,729 మంది గడపదాటి పోలింగ్ బూత్‌లకు రాలేదు. బయ్యారంలో 36,985 ఓట్లకు గాను 29,728 ఓట్లు పోలయ్యాయి. ఇల్లెందులో 78,510 ఓట్లకు గాను 58,891 ఓట్లు, టేకులపల్లిలో 39,965 ఓట్లకు గాను 34,402 ఓట్లు, గార్ల మండలంలో 29,745 ఓట్లకు గాను 24,278 ఓట్లు, కామేపల్లిలో 34,364 ఓట్లకు గాను 24278 ఓట్లు పోలయ్యాయి.

ఈసారి బరిలో 20 మంది...

బీఆర్‌ఎస్ నుంచి హరిప్రియ బానోతు, కాంగ్రెస్ నుంచి కోరం కనకయ్య, సీపీఎం నుంచి దుగ్గి కృష్ణ, బీఎస్‌పీ నుంచి బాదావత్ ప్రతాప్, బీజేపీ నుంచి డి.రవీంద్ర నాయక్, గోండ్వానా దండకారణ్య పార్టీ నుంచి కోడి నాగరాజు, ఆబాద్ పార్టీ నుంచి జార భిక్షం, బహుజన ముక్తి పార్టీ నుంచి రమణాల లక్ష్మయ్య, విద్యార్థుల రాజకీయ పార్టీ నుంచి లకావత్ ప్రసాద్, భారత చైతన్య యువజన పార్టీ నుంచి వాసం రామకృష్ణ, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి చీమల వెంకటేశ్వర్లు, స్వతంత్ర అభ్యర్థులు గుమ్మడి అనురాధ, ఆరెం విజయచందర్, మోకాళ్ల కృష్ణ, గుగులోతు భద్రూ, ముక్తి రాజు, మూతి ముత్తమ్మ, మెస్సు ఉషారాణి, పోలెబోయిన రవి, గుగులోతు సాయికుమార్ బరిలో ఉన్నారు.

ప్రధానంగా ఇద్దరి మధ్యే పోటీ..

ఇల్లెందులో ఈసారి ఇద్దరి మధ్యనే పోటీ నెలకొంది. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి హరిప్రియ, కాంగ్రెస్ పార్టీ నుంచి కోరం కనకయ్య మధ్య పోటీ నెలకొంది. నువ్వా.. నేనా అన్నట్లు పోటీ నెలకొంది. ఆదివారం ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం కావడంతో ఆయా అభ్యర్థుల తరపున ఏజెంట్, నాయకులు కౌంటింగ్ కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇప్పటికే కొత్తగూడెం, పాల్వంచలోని లాడ్జిలు ఏజెంట్లతో నిండిపోయాయి. ఒకవైపు ఏర్పాట్లు చేసుకుంటూనే నేతల్లో, అభ్యర్థులను భయం వెంటాడుతోంది.

బోసిపోయిన పార్టీ కార్యాలయాలు...

ఎన్నికల సందర్భంగా కార్యకర్తలు, నాయకులతో సందడిగా కనిపించిన పలు రాజకీయ పార్టీల కార్యాలయాలు ఎన్నికలు ముగియడంతో నేడు వెలవెలబోతున్నాయి. ఆయా కార్యాలయాల వైపు కన్నెత్తి చూసిన వారే కరువయ్యారు. నిన్నటి వరకు బిజీబిజీగా కనిపించిన నాయకులు ప్రస్తుతం వారి అభ్యర్థులకు ఓట్లు ఎంత వరకు పోలయ్యాయనే అంచనా వేసుకోవడంలో నిమగ్నమయ్యారు. అభ్యర్థులు మాత్రం తమదే గెలుపు అనే ధీమాతో విశ్రాంతి తీసుకుంటున్నారు. విజయం ఎవరిని వరిస్తుందోనని ఎన్నికల ఫలితాల కోసం ప్రజలు ఉత్కంఠంగా ఎదురు చూస్తున్నారు. ఇదిలా ఉండగా కొందరు కార్యకర్తలు తమ పార్టీ అభ్యర్థుల గెలుపుపై బెట్టింగ్‌లు వేసుకుంటున్నారు. ఎన్నికల సందర్భంగా హడావుడిగా ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాలు పూర్తిగా మూతబడ్డాయి.

శ్రమించిన అందరికీ కృతజ్ఞతలు..



అభివాదం చేస్తున్న హరిప్రియ

ఇల్లెందు: ప్రలోభాలు, కుట్రలు, కుతంత్రాలు ఎవరెన్ని చేసినా ఈ ఎన్నికల్లో ప్రజలు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు గెలుపు కోసం అహర్నిషలు కృషి చేశారని వారందరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి హరిప్రియ అన్నారు. శుక్రవారం ఇల్లెందులోని పాత బస్టాండ్ ఎన్నికల కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రెండు నెలలుగా బీఆర్‌ఎస్ శ్రేణులు ఎన్నికల ప్రచారం కోసం సొంత పనులు వదులుకున్నారని, మరికొంత మంది చివరి సమయంలో పార్టీ ఫిరాయించారని వాపోయారు. అయినా అంతిమ విజయం అభివృద్ధి, సంక్షేమ పథకాలకే దక్కుతుందన్నారు. ఇల్లెందు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని తెలిపారు. గెలిచినా ఓడినా ప్రజలతోనే తమ ప్రయాణం సాగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో శ్రీనివాసరెడ్డి, దాస్యం ప్రమోద్‌కుమార్, ఖమ్మంపాటి రేణుక, ఘాజీ, సయ్యద్ జానీపాషా, రవితేజ, పాషా పాల్గొన్నారు.

'వ్యతిరేతను మూట కట్టుకున్న ప్రభుత్వం'



మాట్లాడుతున్న కోరం కనకయ్య, డీవీ

ఇల్లెందు: అడుగడుగునా కేసీఆర్ ప్రభుత్వం ప్రజలను మోసగించిందని, ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజల నుంచి వ్యతిరేకతను మూట కట్టుకుందని కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య, సీపీఐ రాష్ట్ర నాయకుడు కె.సారయ్య, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు దొడ్డా డానియేల్, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావులు అన్నారు. శనివారం ఇల్లెందులోని కోరం కనకయ్య క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రెండు నెలల నుంచి ప్రలోభాలు తీవ్రం చేసి ఓటర్లుకు, కాంగ్రెస్ నేతలను తీవ్ర ఇబ్బందులకు గురి చేసినా భయపడకుండా ఓటేశారని తెలిపారు. జిల్లాలో పదికి పది సీట్లు గెలువబోతున్నామని, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టటం ఖాయం అన్నారు. ఓటేసిన ప్రజలకు, పని చేసిన కాంగ్రెస్, మిత్రపక్షాల నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో జాఫర్, సుదర్శన్ కోరీ, వారా రవి, పింగళి నరేష్ పాల్గొన్నారు.

వెల్లువెత్తుతున్న శుభాకాంక్షలు..

అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడక ముందే కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య విజయం ఖాయం అయిందంటూ ఆ పార్టీకి చెందిన కార్యకర్తలు, నాయకులు శుభాకాంక్షలు తెలుపుతూ శనివారం స్వీట్లు పంచారు. ఇల్లెందులోని క్యాంపు కార్యాలయానికి అభిమానులు తరలిరావడంతో సందడిగా మారింది.

ఎన్నికల నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న సీఐ పెద్దన్నకుమార్

సుజాతనగర్: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన కౌంటింగ్ నేడు జరగనున్న నేపథ్యంలో ప్రతీఒక్కరూ నిబంధనలు తప్పక పాటించాలని చుంచుపల్లి సీఐ ఏ.పెద్దన్న కుమార్ తెలిపారు. సుజాతనగర్‌లో పోలీస్‌స్టేషన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున నలుగురు కంటే ఎక్కువగా గుమికూడవద్దని తెలిపారు. విజయోత్సవ ర్యాలీలు, డీజే చప్పుళ్లను నిషేధించినట్లు తెలిపారు. విజయోత్సవ ర్యాలీలు నిర్వహించాలనుకుంటే ఎస్‌డీపీఓ నుంచి అనుమతులు తీసుకోవాలని చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఎం.సోమేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తగూడెంటౌన్: ఈ నెల 5వ తేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ప్రజలు పోలీసులకు సహకరించాలని కొత్తగూడెం వన్‌టౌన్ ఎం.కరుణాకర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఆదివారం ఉదయం నుంచి ఓట్ల లెక్కింపు జరుగుతుందని, కాబట్టి అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఎటువంటి విజయోత్సవ ర్యాలీలను చేయడం కానీ, డీజేలు, బాణసంచాలను కాల్చడం, ప్రజలు ఒకేచోట గుమికూడటం వంటి చేయరాదని తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని తెలిపారు. నిబంధనలను ఎవరు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నెల 5వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భద్రతా చర్యలు చేపట్టామని తెలిపారు.

సింగరేణి(కొత్తగూడెం): అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు 3వ తేదీన జరగనున్న నేపథ్యంలో కొత్తగూడెం డివిజన్ పరిధిలోని కొత్తగూడెం రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు, డీజేలు పెట్టి బైక్ ర్యాలీలు చేయటం, బాణసంచా కాల్చటం నిషేధం అని కొత్తగూడెం పట్టణ టూ టౌన్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్ రమేష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు, వివిధ పార్టీల కార్యకర్తలు, నాయకులు ఈ విషయాన్ని గమనించి పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.


జంతువుల వేట చట్టరీత్యా నేరం



ఎలుకలొద్దులో గొత్తికోయల ఇళ్లలో తనిఖీలు చేస్తున్న అధికారులు

జూలూరుపాడు: అడవి జంతువులను వేటాడం చట్టరీత్యా నేరమని జూలూపాడు ఎఫ్‌ఆర్ జి.ప్రసాద్‌రావు అన్నారు. శనివారం గుండ్లరేవు గ్రామ పంచాయతీ ఎలుకలొద్దు గ్రామ శివారులో నివాసం ఉంటున్న గొత్తికోయల ఇళ్లలో జూలూరుపాడు ఎఫ్‌ఆర్‌ఓ ప్రసాద్‌రావు, సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అటవీశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గొత్తికోయల ఇళ్లలో సోదాలు నిర్వహించడం జరిగిందన్నారు. గొత్తికోయలు అటవీ జంతువులను వేటాడుతున్నారా? వేటకు ఉపయోగించే ఉచ్చులు, వలలు, బాణాలు, ఆయుధాలు కల్గి ఉన్నారా? అని ఇళ్లలో తనిఖీ చేశామన్నారు. ఈ తనిఖీల్లో ఎలాంటి ఆనవాళ్లు దొరకలేదన్నారు. డీఆర్‌ఓ లక్ష్మీనర్సు, ఎఫ్‌ఎస్‌ఓ వి.మల్లయ్య, ఎఫ్‌బీఓలు చింతా వెంకటేశ్వర్లు, బి.నరసింహారావు, డి.కిషన్, బి.రవి, ఎస్కే రహీం, గొత్తికోయలు పాల్గొన్నారు.

గెలుపోటములపై బెట్టింగ్‌ల జోరు!



సుజాతనగర్: కొత్తగూడెం నియోజకవర్గంలోని అభ్యర్థుల గెలుపోటములపై మండల వ్యాప్తంగా జోరుగా బెట్టింగ్ సాగుతోంది. ఓ పక్క పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, వారి అనుచరులు లెక్కల్లో మునిగి తేలుతున్నారు. మరో పక్క నలుగురు కలిసిన చోట పందేల జోరు ఊపందుకుంది. రూ.1000 నుంచి రూ.లక్షల్లో బెట్టింగ్ వేస్తున్నారు. అంతేకాకుండా తమ పార్టీ అభ్యర్థి గెలిస్తే పార్టీ ఇస్తాం... టూర్‌కు తీసుకెళ్తామంటూ పందేలు కాస్తున్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో బీఆర్‌ఎస్, సీపీఐ, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థుల మధ్య త్రిముఖ పోరు నెలకొంది. ఈవీఎంలలో అభ్యర్థుల భవిష్యత్ నిక్షిప్తమైన తరుణంలో ఓటింగ్ సరళి, గెలుపోటములపై అంచనాలు వేసుకుంటున్నారు. ప్రజలు మాత్రం ఫలితాల కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అభ్యర్థులు గెలుపు ఓటములపై లక్షల్లో పందేలు కాస్తున్నారు. ఎగ్జిట్ పోల్స్ సర్వేలు ఏపార్టీకి విజయావకాశాలు ఉంటాయన్నది సూచనప్రాయంగా చెప్పడంతో ప్రజల్లో మరింత ఆసక్తి నెలకొంది.

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీదే అధికారం..

కొత్తగూడెంరూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఉమ్మడి జిల్లా కేంద్ర మార్కెటింగ్ సహకార సంఘం వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీఆర్‌ఎస్ పాలకులకు ప్రజలు తగ్గిన రీతిలో బుద్ధి చెబుతారన్నారు. రాష్ట్రంలో తొమ్మిది సంవత్సరాలుగా కుటుంబ పాలన కొనసాగుతోందని, ఈ పాలనకు ప్రజలు చరమగీతం పాడారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయటం ఖాయమన్నారు. ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నుంచి తొమ్మిది మంది అభ్యర్థులు కచ్చితంగా విజయం సాధిస్తారన్నారు. అదే విధంగా కొత్తగూడెం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు విజయం ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేస్తుందన్నారు.

'శ్రీ చైతన్య'లో ఎల్లో డే



పసుపు రంగు దుస్తులతో విద్యార్థులు

పాల్వంచ: శ్రీ చైతన్య పాఠశాలలో శనివారం ఎల్లో కలర్ డే నిర్వహించారు. విద్యార్థులు పసుపు రంగు దుస్తులతో హాజరయ్యారు. పసుపు రంగు పండ్లను, పూలను, ఆట వస్తువులను సేకరించి పాఠశాలకు తీసుకొచ్చారు. ఎల్లో కలర్ గుర్తింపునిస్తూ వివిధ కార్యక్రమాలను నిర్వహించారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన రానుంది..



మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ విజయం సాధించనుందని, సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఆంతోటి నాగేశ్వరరావు అన్నారు. శనివారం కొత్తగూడెంలోని కార్పొరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగూడెం నియోజకవర్గంలో కాంగ్రెస్, వామపక్షాలు బలపరిచిన సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు విజయం కోసం తాము గత 20 రోజుల క్రితం 24 సంఘాలకు చెందిన సుమారు 500 మందితో ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి కూనంనేనికి సంపూర్ణ మద్దతు తెలిపినట్లు పేర్కొన్నారు. ఆ ప్రకారంగానే కొత్తగూడెం మండలంలోని 23 పంచాయతీలలోని దళితులను, దళిత సంఘాలను కలిసి కూనంనేని పేదల పక్షపాతి అని, దళితుల సంక్షేమానికి కృషి చేసే వ్యక్తి అని ఆయనను గెలిపించాలని కోరామని, మా కోరిక మేరకు పట్టణంలోని అన్నివర్గాల వారు ఆయన గెలుపుకు కృషి చేసినట్లు చెప్పారు. పదేళ్లుగా దళితులను కేసీఆర్ ప్రభుత్వం అన్ని రకాలుగా మోసం చేసిందని, ఈ క్రమంలో దళిత బంధు విషయంలో కొంతమంది దళారులు నిరుపేదలకు తీవ్ర అన్యాయం చేసి రూ.లక్షలు దండుకున్నారని, ఈ విషయమై నూతన ప్రభుత్వం ఏర్పాడిన తరువాత వాటిపై విచారణ చేయించి దళారులపై చర్యలు తీసుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. కార్యక్రమంలో కూసపాటి శ్రీనివాస్, మందా హనుమంతు, గుండా మల్లేష్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

20 కేంద్రాల్లో మహిళలే టాప్




టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో మహిళా ఓటర్లు (ఫైల్)

టేకులపల్లి: మండలంలోని 44 పోలింగ్ కేంద్రాల్లో గురువారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలో పురుషులు 19,919, మహిళలు 20,046 మొత్తం 39,965 మంది ఉండగా పురుషులు 17,282, మహిళలు 17,120 మొత్తం 34,402 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటర్ల జాబితాలో పురుషుల కంటే 127 మంది మహిళలు ఎక్కువ ఉండగా పోలింగ్‌కు వచ్చే సరికి మహిళల కంటే పురుషులు 162 మంది అధికంగా ఓటింగ్‌లో పాల్గొనడం విశేషం. మండలంలోని 44 పోలింగ్ కేంద్రాల్లో 20 కేంద్రాల్లో మహిళలు పురుషుల కంటే అధికంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. 135 పోలింగ్ కేంద్రంలో 586 ఓట్లు ఉండగా స్త్రీలు 275, పురుషులు 275 చొప్పున ఇద్దరూ సమానంగా ఓట్లు వేయడం గమనార్హం. 131, 132, 37, 139, 141, 142, 145, 146, 147, 150, 152, 154, 155, 157, 158, 159, 162, 167, 170, 174 పోలింగ్ కేంద్రాల్లో పురుషుల కంటే అధికంగా మహిళలే ఓటు వేశారు. మిగిలిన 24 పోలింగ్ కేంద్రాల్లో పురుషులే ఓటింగ్‌లో టాప్‌గా నిలిచారు.

క్రాస్ ఓటింగ్‌తో నేతల్లో కలవరం..

- కీలకంగా మారిన స్వతంత్రుల పోరు, కులం కార్డు
- ఇల్లెందు మండలంపైనే అందరి గురి
- గెలుపోటములపై కొనసాగుతున్న చర్చలు



ఇల్లెందురూరల్: పోలింగ్ రోజున చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ లెక్కలతోనే ప్రధాన పార్టీల అభ్యర్థులు గెలుపోటములపై అంచనాలు వేసుకుంటున్నారు. ఓటింగ్ ఎలా సాగినా మరికొద్ది గంటల్లో ఫలితం తేలనుండటంతో విజయం ఎవరిని వరిస్తుందోనన్న ఉత్కంఠ అందరిలోనూ నెలకొంది.

ఇల్లెందు మండలంపైనే గురి..

నియోజకవర్గంలో ప్రధాన పార్టీల గెలుపోటములను నిర్ధారించే స్థాయిలో ఓటింగ్ ఉన్న ఇల్లెందు మండలం ఓటర్లు ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో కీలక పాత్ర పోషించనున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 2,19,569 ఓట్లు ఉండగా ఒక్క ఇల్లెందు మండలంలో 45,774 మంది ఓటర్లు ఉండగా 32,736 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో అత్యధిక ఓటర్లు ఉన్న ఇల్లెందు మండలంలో అధికంగా ఓట్లు సాధించుకుంటే విజయం నల్లేరు మీద నడకే అన్న భావన అన్ని రాజకీయ పక్షాల్లోనూ నెలకొంది. ఈ దిశగా ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారంలోనూ ఇల్లెందు మండలంపైనే ప్రధానంగా దృష్టి సారించారు. ఇల్లెందు మండలంలో ఓటింగ్ ప్రాధాన్యతను గుర్తించిన నాయకులు గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు సైతం వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

కులం కార్డు ఎవరికి లాభించేనో..

గత అసెంబ్లీ ఎన్నికల నాటి నుంచి ఇల్లెందు నియోజకవర్గంలో కులం కార్డు తీవ్ర ప్రభావం చూపుతోంది. ఓటర్లు కులాల వారీగా విడిపోయి ఎన్నికల రణరంగంలో పావులుగా మారుతున్నారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. గతం కంటే మిన్నగా ఈసారి కులం కార్డును మరింత బలంగా ప్రయోగించి ప్రచారం నాటి నుంచే ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేశారన్న ఆరోపణలు లేకపోలేదు. ఇదిలా ఉండగా పోలింగ్ సమయంలో తాయిలాల పంపిణీ ప్రయోగం ఇల్లెందు ప్రాంతంలో ముఖ్యంగా ఇల్లెందు మండలంలో గందరగోళానికి దారితీసింది. దీంతో పోలింగ్ రోజున కొన్ని రాజకీయ పక్షాలకు పోలింగ్ ఏజెంట్లు కూడా లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.

ఈ పరిణామంతో ఓట్లు పెద్దమొత్తంలో క్రాస్ అయ్యాయన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అయితే ఎన్నికల్లో కులం కార్డు గెలుపు ఓటములను నిర్ధారిస్తుందన్న నమ్మకంతో తాయిలాల పంపిణీ జరిగిందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ విషయంలో కొన్ని రాజకీయ పక్షాలు ఆశించిన ఫలితం పొందడంతో ఎవరికి ఏ మేరకు ఓట్లు క్రాస్ అయ్యాయోనని అందరిలోనూ అయోమయం నెలకొంది.

స్వతంత్రులకు పోలైన ఓట్లపై చర్చ..

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ దఫా స్వతంత్రుల పోరు ప్రధాన పార్టీల అభ్యర్థులకు మింగుడు పడడం లేదు. వారు చీల్చే ఓట్లపైనే ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపోటములు ఉంటాయని సర్వత్రా చర్చ జరుగుతోంది. సుదీర్ఘ కాలం ఎమ్మెల్యేగా పనిచేసిన గుమ్మడి నర్సయ్య కుమార్తె గుమ్మడి అనురాధ, నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ శ్రేణుల్లో గుర్తింపు కలిగిన నేతగా కొనసాగిన చీమల వెంకటేశ్వర్లు ప్రధాన పార్టీల అభ్యర్థులకు ధీటుగా ఎన్నికల ప్రచారం కొనసాగించారు. వీరితోపాటు గిరిజనేతరులు బలపర్చిన అభ్యర్థిగా మెస్సు ఉషారాణి బరిలో నిలవడంతోపాటు ప్రచారం కూడా ఉధృతంగా చేపట్టడంతో ఎవరికి ఎన్ని ఓట్లు పోలయ్యాయనే అంశంపై ప్రధాన పార్టీల అభ్యర్థులు చర్చించుకోవడం స్వతంత్ర్యుల బెడద తీవ్రతను బహిర్గతం చేస్తోంది. ఏదేమైనా కులం కార్డు, స్వతంత్ర్య అభ్యర్థుల బెడద, పోలింగ్ రోజున ఇల్లెందు మండలంలో చోటుచేసుకున్న పరిణామాలే ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపు ఓటములను నిర్దేశిస్తాయనడంలో ఎటువంటి సందేహం లేదు.

బెట్టింగుల జోరు..

ఇల్లెందు నియోజకవర్గ పరిధిలో ఉత్కంఠగా సాగిన ఎన్నికల ప్రచారానికి తోడు గెలుపు ఓటములు కూడా అంతే స్థాయిలో ఉండటంతో బెట్టింగులు జోరందుకున్నాయి. ఫలానా గ్రామపంచాయతీలో.. ఫలానా మండలంలో అత్యధిక ఓట్లు ఎవరికి పోలవుతాయి.. మెజారిటీ ఎంత వస్తుంది.. వంటి అంశాల ప్రాతిపదికన బెట్టింగులు జరుగుతున్నాయి. అభ్యర్థుల మీద ఉన్న అభిమానం, పార్టీలపై ఉన్న ప్రేమతో పలువురు ఈ సాహసానికి ఒడిగడుతున్నట్లు ప్రచారంలో ఉంది.